క్లుప్తంగా

నామినేషన్‌కు తరలిరావాలి

ఐ.పోలవరం: ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ నామినేషన్ ఈనెల 19న వేయనున్నారని, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనామినేషన్ శుక్రవారం ఉదయం ముమ్మిడివరం కొండాలమ్మ చింత నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ నామినేషన్ వేస్తారని తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు, చొల్లంగి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు సబ్‌స్టేషన్ పరిధిలో యానాం నుంచి తాళ్లరేవు, పల్లిపాలెం ఫీడర్ పరిధిలోని పి.మల్లవరం, జార్జిపేట, పోలేకుర్రు పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలు, చొల్లంగి సబ్‌స్టేషన్ పరిధిలో చొల్లంగి, చొల్లంగిపేట, పంచాయతీ పరిధి గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఐరన్, హార్డ్‌వేర్ అసోసియేషన్ మాజీ నేత పేరూరి మృతి


పేరూరి సుబ్బారావు (ఫైల్)

అమలాపురం టౌన్: పట్టణంలోని ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ కోశాధికారి, పట్టణ వైశ్య సంఘ సీనియర్ నాయకుడు పేరూరి సుబ్బారావు (94) మంగళవారం రాత్రి వృద్ధాప్యంతో తన స్వగృహంలో మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గతంలో సుబ్బారావు స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం ధర్మకర్తల మండలి సభ్యుడిగా పనిచేశారు. ఆయన పలు సేవా కార్యక్రమాలు చేశారు. పట్టణంలోని వ్యాపార సంఘాల ప్రతినిధులు స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులోని దివంగత సుబ్బారావు ఇంటికి బుధవారం వెళ్లి సంతాపం తెలిపారు.

మైథిలీవతి శతకం గ్రంథావిష్కరణ


లక్ష్మణాచార్యులను సత్కరిస్తున్న దృశ్యం

యానాం: పట్టణంలో ఉన్న భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకులు, ఉపాధ్యాయుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు రచించిన మైథిలీపతి శతకం గ్రంథాన్ని బుధవారం శ్రీరామ భోజనం మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడు శతకాలు, 3వేలకు పైగా సమస్య పురాణాలు, అభినందన, ఆశీర్వచన పద్యాలు రచించడమే కాకుండా మైథిలీపతి వంటి శతక గ్రంథాన్ని రచించారన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణాచార్యులను ప్రశంసించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ ముద్రాపకులు కశిరెడ్డి పేరయ్య, పెద్దింటి వినోదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోకి కర్రిచెరువు ప్రాంతానికి చెందిన చిత్రపు ఆంజనేయులు(అంజి) 41 రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకి ఉరి వేసుకుని మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీవనోపాధి నిమిత్తం భార్య గల్ఫ్‌లో ఉండడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. మృతుడు తండ్రి చిత్రపు బాలయోగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్ బుధవారం తెలిపారు. అంజి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై తెలిపారు. మృతుడుకి ఇద్దరు కుమారులు ఉన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

అయినవిల్లి: ఒంటరిగా ఉన్న ఓ వృద్ధ మహిళ ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో బంగారు గొలుసును బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని ఓ వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. దీనికి సంబంధించి ఎస్సై బి.రాజేష్‌కుమార్, ఆమె బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లిలోని ముక్తేశ్వరంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఒంటరిగా ఉంటున్న 70 ఏళ్ల చంద్రమౌళి సత్యవతి ఇంట్లోకి బుధవారం తెల్లవారుజామున ఓ గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఆమె మెడలో నాలుగున్నర కాసుల బంగారు గొలుసును లాక్కుని పరరయ్యాడు. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.


అమలాపురంలో పీటలపై కూర్చున్న దేవదాయశాఖ ఈవో లక్ష్మీ నారాయణ దంపతులు


విలసవిల్లిలో సీతారాములు కల్యాణం చేస్తున్న పండితులు


అమలాపురం భూపయ్య అగ్రహారంలో శ్రీరామచంద్రమూర్తి రథోత్సవం


భక్తులకు బెల్లం పానకం పంపిణీ చేస్తున్న పట్టణ స్వర్ణకార సంఘం సభ్యులు


జార్జిపేటలో కన్నుల పండువగా జరుగుతున్న సీతారాముల కల్యాణం

అంతా రామమయం


అమలాపురం గొవ్వాలవారివీధి రామాలయాన్ని దర్శించిన మంత్రి విశ్వరూప్


చినకొత్తలంకలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

- వైభవంగా సీతారాముల కల్యాణాలు
- తిలకించి తరించిన భక్తజనం
- ఘనంగా నవమి వేడుకలు
- పలు రామలయాలను దర్శించిన మంత్రి విశ్వరూప్


చింతావారివీధిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

అమలాపురం టౌన్: శ్రీరామ నవమి వేడుకలు బుధవారం నియోజకవర్గ ప్రజలు వైభవంగా జరుపుకొన్నారు. రామాలయాలకు భక్తులతో పోటెత్తాయి. ప్రతి ఆలయంలోనూ సీతారామ కల్యాణాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కల్యాణ ఘట్టాన్ని భక్తులను తిలకించి తరించారు. శ్రీరామ నామ జపంతో అంతా రామయయంగా మారింది. ముఖ్యంగా అమలాపురం పట్టణంలోని 49 రామాలయాల్లో సీతారాములను వేలాది మంది భక్తులు దర్శించుకుని శ్రీరామ నవమి పూజలు చేశారు. పట్టణంలోని వంటెద్దువారి వీధి, గొవ్వాలవారివీధి, భూపయ్య అగ్రహారం, నలా వీధి తదితర వీధుల్లోని రామాలయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సందర్శించి శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేశారు. భూపయ్య అగ్రహారంలోని రామాలయం వద్ద మంత్రి విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు సీతారామ కల్యాణాన్ని తిలకించారు. నల్లా వీధి రామాలయాన్ని దర్శించుకున్న మంత్రి విశ్వరూప్‌ను ఈ వీధి ప్రజలు ఘనంగా సత్కరించారు. నారాయణపేట, సూర్యనారాయణపేట, సూర్యనగర్, మహిపాలవీధి, నల్లా వీధి, కొంకాపల్లి, కూచిమంచి అగ్రహారం తదితర వీధులు, కాలనీల్లో గల రామాలయాల్లో సీతారామ కల్యాణాలు కన్నుల పండువగా జరిగాయి. రామాలయాల వద్ద బెల్లం పానకాలను భక్తులకు పంచిపెట్టారు. అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. భూపయ్య అగ్రహారంలోని శ్రీరామచంద్రమూర్తి ఆలయంలో మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానం ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ దంపతులు కర్తలుగా సీతారామ కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. పట్టణంలోని పలు రామాలయాలను వైఎస్సార్ సీపీ నాయకులు దర్శించుకుని పూజలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర,వంటెద్దు వెంకన్నాయుడు, కౌన్సిలర్లు మంత్రి విశ్వరూప్ వెంట ఉండి పలు రామలయాలను దర్శించారు.

పానకం పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక గోల్డ్ మార్కెట్‌లోని కామాక్షీ ఆలయం వద్ద పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో భక్తులకు బెల్లం పానకం పంపిణీ చేసింది. సంఘం అధ్యక్షుడు భరణికాన బాబు, కార్యదర్శి ఓడూరి ఫణి, కోశాధికారి చింతా నాని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక పట్టణ వైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. సంఘం ప్రతినిధి వరదా సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నంబూరి మూర్తి, అధ్యక్షుడు యెందూరి వెంకట్రామయ్య, మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు వంకాయల కాశి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో..

ఉప్పలగుప్తం: మండలంలో భీమనపల్లి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం, వానపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పలగుప్తంలో పెద్దింటి లక్ష్మణాచార్యులు, విలసవిల్లిలో మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: నియోజకవర్గంలో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడవాడలా రామాలయాలలోను, ముఖ్యకూడలిలో చలువ పందిళ్లు వేసి సీతా రాముల కల్యాణం వైభవపేతంగా నిర్వహించారు. మండలంలో చినకొత్తలంకలో శ్రీపట్టాభిరామ స్వామి ఆలయంలో పాత్తూరి రామ్‌చరణ్, నళిని దంపతులతో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ, పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ప్రముఖ వైద్యులు జంధ్యాల శివ కుమార్, డా. జగన్‌మోహన్‌లు గ్రామ సర్పంచ్ పాత్తూరి ఉమారాణి, సొసైటీ అధ్యక్షులు పీటీవీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రామయ్య కల్యాణం

ఐ.పోలవరం: మండలంలో రామాలయాలు సీతారాముల కల్యాణ సందడితో శోభిల్లాయి. హనుమ ఆలయాల్లో సీతారాముల కల్యాణాలు వైభవంగా జరిగాయి. మండలంలో మురమళ్ల, ఐ.పోలవరం, కేశనకుర్రు, జి.వేమవరం, టి.కొత్తపల్లి, పశువుల్లంక, కొమరగిరి, తదితర ప్రాంతాలలో గల రామాలయాల్లో సీతారామ కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. చలివిడి, వడపప్పు, బెల్లం పానకాలు భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అందించారు. తీరప్రాంత గ్రామం అయిన భైరవపాలెం తీర్థాల మెండి గ్రామంలో మత్స్యకారులు సీతారాముల విగ్రహాలను కోలాటాలు, భజన కీర్తనలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అల్లవరంలో..

అల్లవరం: దేవగుప్తంలోని శ్రీకొదండ రామాలయంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పురోహితులు పోచినపెద్ది నరసింహమూర్తి ఆధ్వర్యంలో కుడుపూడి జయకృష్ణ, ఉష దంపతులతో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి దర్శించుకున్నారు. డి.రావులపాలెంలో శ్రీరామకోవెలలో గంధం శ్రీనివాసరావు దంపతుల చేతులమీదుగా, కోడూరుపాడులోని రామారావుపేటలో కొడండ రామాలయంలో ఈ దంగేటి శ్రీను, సీతామహాలక్ష్మి దంపతుల చేతులమీదుగా కల్యాణం నిర్వహించారు. దేవగుప్తం బ్రహ్మణ వీధిలోని సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించి, భక్తులకు పానకాలు అందించారు. మండలంలోని వాడ వాడలా శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: మండలంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా జార్జీపేట ప్రధాన రహదారిలో వేంచేసి ఉన్న సీతారాములవారి ఆలయంలో గ్రామ మాజీ సర్పంచ్ కనకాల సత్తిబాబు నేతృత్వంలో ఆలయ అర్చకులు సుదర్శనం సత్య వెంకట ఫణికుమార్ పర్యవేక్షణలో స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో సీతారాములను అభిషేకించారు. అనంతరం భక్తులకు పానకం పంపిణీ చేశారు. విసనకర్రలు అందజేశారు. అన్నసమారాధన చేసారు. తాళ్లరేవు కేశవపురం గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు.

యానాం నియోజకవర్గంలో..

యానాం: నియోజకవర్గంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయా రామాలయాల్లో విశేష పూజలు, కల్యాణం కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చింతావారివీధిలో కోదండరామాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరై, స్వామివారికి పూజలు నిర్వహించారు. కనకాలపేటలో శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో 77వ శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. అగ్రహారం, కామిశెట్టివారివీధి, పోలీస్‌స్టేషన్ ఎదురుగా శెట్టిబలిజసంఘ ఆధ్వర్యంలో రామాలయంలోను, అంబేడ్కర్ నగర్, మెట్టకూరు, డోబీవీధి, దరియాలతిప్ప, సావిత్రినగర్, గిరియాంపేట తదితర గ్రామాల్లోను శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి.

అమలాపురం రూరల్ మండలంలో..

అమలాపురం రూరల్: మండలంలో పలు గ్రామాల్లో రామాలయాల్లో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బండారులంకలో దంగేటివారి పాలెంలో భక్తులు కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రోళ్లపాలెం సుందర్ నగర్, బండారులంక వల్లరి వారి పుంత తదితర గ్రామాల్లో అందించారు.


రోళ్లపాలెంలో స్వామివారి పల్లకి మోస్తున్న భక్తులు


బండారులంక వల్లరి వారి పుంతలో స్వామివారికి పట్టు వస్త్రాలు అందిస్తున్న శ్రీశైలం మాజీ ట్రస్టీ శంకరమూర్తి దంపతులు

ఆకర్షణీయం.. సీతారాముల చిత్రం..



దేవకి గీసిన సీతారాముల కల్యాణ చిత్రం

ఉప్పలగుప్తం: గతంలో పండుగ శుభాకాంక్షలు తెలియజేయాలంటే ఉత్తరాలతో తెలుపుకొనే వారు. సెల్‌ఫోన్లు వచ్చిన తరువాత మోబైల్‌లో గ్రాఫిక్ చిత్రాలను పంపించేవారు. ప్రస్తుతం విద్యార్థులు భిన్నంగా ఆలోచిస్తున్నారు. వారిలో ఉన్న నైపుణాన్ని తెలియజేస్తూ పెన్సిల్‌తో గీసిన చిత్రలేఖనలతో శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మండలంలోని పెదగాడవిల్లి గ్రామానికి చెందిన అడపా సత్యదేవకి గీసిన చిత్ర లేఖనం సామాజిక మాధ్యమంలో వైరల్ అవ్వటంతో ఆమె నైపుణ్యాన్ని గుర్తించి పలువురు ఆమెకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు


వైఎస్సార్ సీపీ చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న బాలకృష్ణ తదితరులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పోలేకుర్రు గ్రామ పంచాయతీకి చెందిన సుమారు 150 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం రాత్రి నరాల రాము, నరాల రాంబాబు, మట్టపర్తి మహేష్, గుత్తుల పోలరాజు, గీసాల లోవరాజుల సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన వారికి పితాని బాలకృష్ణ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయానికి కృషి చేయాలని బాలకృష్ణ కోరారు. ఈ కార్యక్రమాలలో శెట్టిబలిజ నాయకులు రెడ్డి సతీష్, పితాని సత్తిబాబు, కొప్పిశెట్టి వెంకట్, టేకుమూడి త్రిమూర్తులు, బొంతు వీర మోహన్, మట్టపర్తి లోవరాజు, పంపన రామకృష్ణ, కాలా వెంకట రమణ, దెయ్యాల సత్తిబాబు, కడియాల శ్రీను, గ్రామ ఉపసర్పంచ్ దడాల గణేశ్వరరావు, పలివెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను చైతన్య పరిచేలా...

- యానాంలో కార్బన్ ఫుట్‌ప్రింట్ కార్యక్రమం


మొక్కలను నాటుతున్న ఆర్‌ఓ మునిస్వామి, సిబ్బంది

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి శుక్రవారం పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కార్బన్ న్యూట్రల్ కార్యక్రమాన్ని బుధవారం యానాం లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఐటీఐ ప్రాంగణం లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి, వ్యవసాయ అధికారులు పలువురు మొక్కలను నాటారు. పర్యవరణాన్ని కాపాడేలా గ్లోబల్ వార్మింగ్‌కు దారితీసే గ్రీన్‌హౌస్ వాయువు మొత్తమైన కార్బన్ పుట్‌ప్రింట్స్‌ను తగ్గించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మొత్తం ఈ ఎన్నికల ప్రక్రియ పరంగా వచ్చే చెత్త, విద్యుత్ వినియోగం, ఇంధన వినియోగం, అదేవిధంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఫలితాలు వెలువడే వరకు వినియోగించిన మెటీరియల్స్ తదితర వాటిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్, ఎకాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌సెస్ శాఖలు పుదుచ్చేరి యూనివర్సిటీ లెక్కిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


అంబేడ్కర్ జయంతి ఉత్సవ సభలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలంటూ వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం పేరూరు సెంటర్‌లో అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన అంబేడ్కర్ జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, దళిత నాయకులు డి.బి.లోక్, పెయ్యల పరశురాముడు, బీసీ సంఘనాయకుడు పెచ్చెట్టి చంద్రమౌళి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జల్లి జనార్దన రావు, దేవరపల్లి విరేష్ కుమార్, దాసరి నాగేశ్వరరావు, పల్లి సుబ్బారావు, పేరూరు జై భీమ్ సంక్షేమ సంఘం సెక్రటరీ ముత్తాబత్తుల సత్యనారాయణ, కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మెయిల సత్యనారాయణ, ముత్తాబత్తుల వీర వెంకట సత్యనారాయణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గోసంగి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి గెలుపుతో యానాం అభివృద్ధి

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గానికి బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నమశ్శివాయం గెలుపుతో యానాం అభివృద్ధికి మరింత సహకారం లభిస్తుందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరికి వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న యానాంలో మౌలిక సౌకర్యాలు ఇంకా కల్పించాల్సి ఉందని, ఆ విధంగా వివిధ కాలనీల్లో ఇప్పటికీ రహదారులు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సౌకర్యాలు లేవని, ఈ సమస్యలన్నీ పరిష్కారిస్తామన్నారు. ఇప్పటికే ఇళ్ల పట్టాలకు స్థల సేకరణ చేశామని, ఇళ్ల పట్టా పంపిణీకి నమశ్శివాయం చర్యలు తీసుకుంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా పర్యాటకాభివృద్ధికి నిధులు, మెడికల్ కళాశాల స్థాపన, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు తదితర అంశాలు త్వరలో సాకారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండు సిద్ధార్థ, నక్కల సుబ్బన్న, కాకినాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అమలాపురంలోని ఓ గ్యాస్ గొడౌన్ వద్ద ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


ముమ్మిడివరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

అమలాపురం టౌన్: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం స్థానిక అగ్ని మాపక కేంద్రం సిబ్బంది పట్టణంలోని పెట్రోలు బంకులు, గ్యాస్ గొడౌన్లను సంబవించే అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఒక వేళ పెట్రోలు బంకు లేదా గ్యాస్ గొడౌన్‌లో అగ్ని ప్రమాదం అనివార్యమైతే తక్షణమే ఎలా స్పందించాలో, మంటల నివారణకు ఎలాంటి ప్రయత్నాలు చేయాలో ప్రయోగాత్మకంగా అగ్ని మాపక యంత్రాలను ప్రదర్శించి వివరించారు. పెట్రోలు బంకులు, గ్యాస్ గొడౌన్ల సిబ్బందికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కర పత్రాలను పంపిణీ చేశారు. అమలాపురం అగ్ని మాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు, లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్‌ల ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాలు జరిగాయి.

ముమ్మిడివరంలో...

ముమ్మిడివరం: అగ్నిమాపక సిబ్బంది నగర పంచాయతీ పరిధిలోని పెట్రోలు బంక్‌ల వద్ద జరిగే ప్రమాదాలు, వాటి నివారణపై ప్రయోగాత్మకంగా ప్రజలకు వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి మురళీ కొండబాబు ఆధ్వర్యంలో కేఏఎస్ఎస్ నారాయణ, కె.శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపే యానాంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- పుదుచ్చేరి లోక్‌సభ స్థానం ఓటర్లు 10,23,699 మంది
- యానాం నియోజకవర్గ ఓటర్లు 39,408 మంది
- పోలింగ్ బూత్‌లు 33
- బరిలో 26 మంది అభ్యర్థులు
- ఇండిపెండెంట్లు 19 మంది
- బీజేపీ, ఎన్ఆర్‌కాంగ్రెస్ కూటమి, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాంలో శుక్రవారం పోలింగ్ జరుగనుండడంతో ఎన్నికల శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. పుదుచ్చేరిలోక్‌సభ స్థాన పరిధిలో యానాంతో పాటు కారైకల్, పుదుచ్చేరి, మాహే రీజియన్లు ఉన్నాయి. ఈ లోక్‌సభ స్థానంలో 10,23,699 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 5,42,979 మంది, పురుషులు 4,80,569 మంది, థర్డ్‌జెండర్స్ 151 మంది ఉన్నారు. యానాం ఓటర్లు 39,408 మంది ఉన్నారు. ఇందులో మహిళాఓటర్లు 20,371 ఉండగా, పురుష ఓటర్లు 19037 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు వీలుగా 33 పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేశారు. ఆయా బూత్‌ల్లో ఈవీఎంలు, బ్యాలెట్‌యూనిట్లు, వీవీ ప్యాట్‌లు వినియోగానికి ఇప్పటికే సిద్ధం చేశారు.

ప్రధానంగా పోటీలో ఉన్న పార్టీలు

బీజేపీ, ఎన్ఆర్‌కాంగ్రెస్ ఎన్డీయేకూటమి, కాంగ్రెస్ పార్టీ మధ్యేపోరు ఎక్కువగా ఉంది. బీజేపీ, ఎన్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నమశ్శివాయం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.వైథిలింగం మధ్యే ప్రధాన పోరు జరుగనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం 26 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇండిపెండెంట్‌గా గెలిచిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ యానాం అభివృద్ధి దృష్ట్యా ఎన్డీయే కూటమికి మద్దతునిస్తున్నారు. ఈ నేపథ్యంలో నమశ్శివాయంకు మద్దతుగా ప్రచారం చేశారు. అదేవిధంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఎన్ఆర్‌కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్నారు. కాంగ్రెస్ తరపున మల్లాడి సత్తిబాబు ప్రచారం చేస్తున్నారు. దీంతో ప్రధాన పార్టీలు ఎన్డీయే కూటమికి మద్దతునివ్వడంతో నమశ్శివాయం గెలుపు ఏకపక్షం కానుందని భావిస్తున్నారు.

విస్తృత ప్రచారం

ఎన్డీయేకూటమి పార్టీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గత 15 రోజులుగా తమ అభ్యర్థుల విజయం కోరుతూ గత 15 రోజులుగా విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. తీర గ్రామాల్లో మత్స్యకార ఓట్లు, కాపులు, ఎస్సీల ఓట్లు అత్యధికంగా ఉండడంతో ఆయా వర్గాలు ఏ పార్టీవైపు మొగ్గుచూపుతారో వారికే యానాం నుంచి అత్యధిక ఓట్లు వస్తాయని భావిస్తున్నారు. దీంతో యానాం నియోజకవర్గం ఓట్లు అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర వహించనున్నాయి. 33 బూత్‌లు ఈవీఎంలసెట్లు 13 రిజర్వ్ 46 సెట్లు ఉన్నాయి. సిబ్బంది పోలింగ్ ఒక్కో బూత్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫస్ పోలింగ్ ఆఫీసర్ 123 ఒక ఎంటీఎస్, ఉదనంగా ఒక వలంటీర్, బూత్‌లెవల్ ఆఫీసర్ బయట హెల్ప్‌డెస్క్ కోసం ఉంటారు.

కుష్ఠు రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ

అయినవిల్లి: సేవాతత్పరతతో పనిచేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణశ్రీనివాస్ దంపతులను నగరం మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అభినందించారు. బుధవారం అన్నపూర్ణ శ్రీనివాస్ దంపతులు విలస గ్రామంలోని మన్నా మినిస్ట్రీస్ న్యూ లైఫ్ సెంటర్ (కుష్ఠు, ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం)లో వ్యాధి పీడితులకు బ్రెడ్లు, పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనే గంగుమళ్ళ అన్నపూర్ణ, శ్రీనివాస్ దంపతులు అనేక సేవలు అందించారని అభినందించారు.

చీరల వితరణ

అంబాజీపేట: శ్రీరామనవమిని పురస్కరించుకుని స్వర్ణలత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ జె.రాంప్రసాద్ ఆధ్వర్యంలో అంబాజీపేట శివారు కొత్తపాలెంలో వృద్ధులకు చీరలను బుధవారం పంపిణీ చేశారు. మజ్జిగ పంపిణీ చేశారు.